
# నాకీ బొమ్మ చాలు!



గ్రాఫిక్స్: భాస్కర్

-చిల్లర భవానీదేవి

**తూ**ర్పు దిక్కు బద్దలైపోయి రెండు గంట లవుతోంది.

రామకృష్ణ 'గీతా మందిరం' దాకా వాకింగ్ చేసి ఇంటికి తిరిగి వచ్చాడు నీరసంగా!

ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. ఓసారి అంతా కలియ చూశాడు. ఎక్కడా చడీ చప్పుడూ లేదు. కొడుకు, కోడలు ఇంకా మేడ మీంచి దిగినట్లు లేరు. గడియారం ఏడున్నర చూపిస్తోంది. నాలుక కాఫీ కోసం పీకేస్తోంది. కానీ తాను స్వయంగా కాఫీ తయారు చేసుకుంటే కోడలు ప్రమీల సృష్టించే సీన్ గుర్తొచ్చింది.

''ఏం? కోడలు కాఫీ కూడా చేసివ్వదని ప్రచారం చేయాలనుకున్నారా! నేనుండగా మీరు వంటింట్లోకి వస్తే నేను చచ్చినట్లే కదా!'' గట్టిగట్టిగా చేతులు ఊపుతూ అరిచింది. ఆ దృశ్యం గుర్తొచ్చి ఒక్కసారి ఉలిక్కిపడి ఆ ఆలోచనను విరమించుకున్నాడు.

అసలు సీత పోయాక వంటింటి ఛాయలకే పోవడం తగ్గి

పోయింది. సీత ఉన్నప్పుడు అప్పుడప్పుడు సరదాగా తానే తయారు చేసి ఇచ్చే వాడు. అప్పట్లో వాకింగ్ కూడా అంతగా అలవాటు లేదు. ఎనిమిది గంటలకు సీత పదిసార్లు లేపితేనే లేవడం.

సీతతో కలిసి జీవితం పంచుకున్న ఆ రోజులు రామకృష్ణ మనః ఫలకం మీంచి చెరిగి పోకుండా ఇంకా తాజాగా ఉన్నాయి. ఇంకా నిన్న మొన్న జరిగినట్లుగా ఉన్నాయి.

కొన్ని దృశ్యాలంతే!

మనిషి మర్చిపోవాలన్నా వీలు కాదు.

గోడ మీది ఫోటోలో సీత చిరునవ్వు చిందిస్తోంది!

''నన్ను గుర్తు చేసుకుంటున్నారు కదూ!'' అని. మనసంతా చేదుగా ఉంది.

మనిషి పోతేనే గానీ జ్ఞాపకాలు ముద్ర పడవు.

'పోయినోళ్లు అందరూ మంచోళ్లు!

ఉన్నోళ్లు పోయినోళ్ల తీపి గురుతులు.'

ఎక్కడి నుంచో ఆత్రేయ పాట గుండె తలుపు తీసుకుని ప్రేమ గా జొరబడుతోంది.

ఎనిమిదవుతుండగా ప్రమీల మేడ దిగి వంటింట్లోకి వచ్చింది. ఆమె ఇచ్చిన కాఫీ తాగి స్తబ్దుగా తన గదిలోకి వెళ్లాడు రామకృష్ణ.

''నిన్ననగా చెప్పాను. కూరలు తెమ్మని. మీ నాన్నగార్కి నా మాటలు వినిపిస్తేగా'' ప్రమీల వెనుక నుంచీ మూతి మూడు వంక రలు తిప్పడం తెలుస్తోంది. కొడుకు వాసు ఏమీ మాట్లాడక పోవడం మామూలై పోయింది. మనసంతా శూన్యమంత నిస్పృహాయంగా ఉంది.

☆☆☆

వాసుకు తగిన భార్య కోసం ఎన్ని సంబంధాలు చూసింది సీత! చివరికి వాడి ఇష్టాను సారమే ప్రమీలను చేశారు.

''మాకు కోడలు కాదు. కూతురు కావాలి'' అని ఆశపడ్డారు.

అటువంటిది ప్రమీల ప్రవర్తన చూడకుండా త్వరగా దాటి పోయిన సీత నిజంగా అదృష్టవంతురాలు!

''అంతసేపు గదిలో కూర్చుని ఏం చేస్తారో ఏమో!'' బిగ్గరగా అరుస్తోంది కోడలు.

వాసు గుమ్మం దాకా వచ్చి అసహనంగా అన్నాడు.

''నేను మళ్లీ ఆఫీసుకు వెళ్లాలని తెలుసు కదా! త్వరగా వెళ్లి కూరలు పట్రండి.''

ఆజ్ఞాపించిన కొడుక్కి కోపంగా జవాబు చెప్పాలని పిస్తోంది. కోపాన్ని బాగా అణుచు కోవడం అసలు చిన్నప్పటి నుంచీ అలవాటు అయిపోయింది. ఉద్యోగంలో ఉన్నప్పుడు కూడా కింది వారికీ, పై వారికీ కూడా కోపంగా బదులు ఇచ్చి ఎరగడు.

గదిలోంచి బైటకు వచ్చి కొడుక్కేసి పరీక్షగా చూస్తూ శాంత స్వరంతో,

''చెప్తే ఎందుకు తేను. అయినా నేనేంతెచ్చినా కోడలికి నచ్చదు'' అన్నాడు.

''మీరు తెచ్చినవన్నీ పుచ్చినవీ, కుళ్లినవీ అయితే నాకెలా నచ్చుతాయి'' పరుసుగా అంది ప్రమీల.

''ఎవరైనా తెస్తే నచ్చనప్పుడు, ఎవరికి కావలసినవి వారే తెచ్చు కోవడం మంచిది కదమ్మా'' మెల్లగానే అన్నా ఆ మాటలు చురుగ్గా తగిలాయి.

''ఇంట్లో ఖాళీగా ఉండి ఏం చేస్తారు. చిన్న చిన్న పనులు చేస్తే తప్పా!''

''వాదాలు ఆపండిక'' వాసు కసిరాడు.

మౌనంగా సంచి తీసుకుని బయలుదేరాడు రామకృష్ణ.

రోతు కొద్దీ గుర్రం. సీత ఇలా తన వెనుకేనాడూ సంచి ఇచ్చి బజారుకి పంపలేదు. తనకేం తినాలని ఉందో కనుక్కొని తెప్పించి వండి వడ్డించేది. ఆమె ఎలా తెప్పించేదో కూడా తెలీదు తనకి. కొత్త కొత్త వంటకాలు రుచికరంగా చేసి పెట్టేది. కొసరి కొసరి వడ్డించేది. ఏదైనా తినాలని ఉంది అని అడిగితే వెంటనే సంతోషంగా చేసి పెట్టేది. తను రిటైర్ కావడం, వాసు పెళ్లి... సీత పోవడం... ఏమిటో ఫ్. రిటైరు అయితే వచ్చిన డబ్బుతో వాసుకి స్కూటరు, ఒక చిన్న ఇల్లు కొన్నాడు. సొంత ఇల్లు కోరిక తీరకుండానే సీత దాటి పోయింది. ఇంక మిగిలింది పెన్షన్. అదీ ఇలానే ఏదో ఒక వంకతో ప్రమీల ఖర్చు చేయిస్తూనే ఉంది. ఎన్నాళ్ల నుంచో మిగిలిన చిన్న చిన్న కోరికలు కూడా తీరని జీవితం. కారు హారన్‌తో ఈ లోకంలోకి వచ్చాడు రామకృష్ణ.

☆☆☆

కొడుకు భోజనం చేసి ఆఫీసుకి వెళ్లాడు. కోడలు మామూలుగానే స్నేహితుల ఇళ్లకి వెళ్లింది. సీత ఫొటో కేసి చూస్తూ కూర్చున్నాడు. డైనింగ్ టేబుల్ మీద అన్నీ ఉన్నాయి. దగ్గరుండి ప్రేమగా వడ్డించే వాళ్లు లేరు. నిజంగా సీతకెంత సహనం. విసుక్కోకుండా జీవిత కాలం సేవలు చేసింది. భార్య విలువ వృద్ధాప్యంలోనే తెలుస్తుంది. నిస్సారమైన వర్తమానం! ఒక్కొక్క క్షణం గడవడం ఎంత కష్టం. కొడుకు కోడలు కలిసి తనతో మాట్లాడేదీ లేదు. భోజనాల దగ్గర అందరూ కలిసి కూర్చునేది తక్కువే. చిన్నప్పుడైతే అమ్మా నాన్న లతో కలిసే భోజనం చేసే వాడు. వాసుకు ఇష్టం లేని కూరలు సీత అసలు వండేది కాదు. కానీ ఇప్పుడు అవే కనిపిస్తున్నా వాడు పట్టించు కోవడం లేదు. ఈ ఇంట్లో తనకు ఎవరున్నారని చూరు పట్టుకు వేలాడటం? సీత లేని ఇల్లు ... తనకే తాను భారంగా ... ఎవరో స్నేహితుడు చెప్పినట్లు ఆ వృద్ధాశ్రమంలో చేరితేనో! అక్కడైతే కనీసం తనలాంటి వాళ్లు చాలా మంది ... ఆత్మీయంగా ... సాను భూతితో ... ఒకే పడవ ప్రయాణీకులు ... ఆ వూరు పోయి ఓసారి కనుక్కొని రావాలి. ఇప్పుడు బయలు దేరితే సాయంత్రానికి రావచ్చు. కొంచెం ఆలస్యం అయినా ఫర్వాలేదు. కొంచెం చూపు మసక ... అయితే నేం మేనేజ్ చేసుకోవచ్చు. నాలుగు మెతుకులు నోట్లో వేసుకుని చెప్పులేసుకుని రైల్వే స్టేషన్ వైపు నడుస్తున్నాడు రామకృష్ణ. ఆయన చూపులు మాటి మాటికీ గడియారం వైపే ఆదుర్దాగా చూస్తున్నాయి.

☆☆☆

వృద్ధాశ్రమం తోటలో ఉదయపు నీరెండలో పచార్లు చేస్తున్న రామ కృష్ణ ఎవరో పిల్చినట్లనిపించి తలెత్తి చూశాడు.

పచ్చగా హుందాగా టక్ చేసుకున్న ఆ యువకుడు తననే పిలుస్తు న్నాడు.

''ఏంటి బాబూ?'' రెండడుగులు వేశాడు రామకృష్ణ.

''బాబు గారూ... నేను కల్యాణ్‌ను...''

రామకృష్ణకు ఆ మాటలకి కళ్లు మెరిశాయి. తరువాత చెమర్చాయి.

''నువ్వా బాబూ.. కల్యాణ్! ఎన్నాళ్లకి... '' చేతులు పట్టుకొని ఆనందాశ్చర్యాలతో ఎమోషనల్‌గా అయిపోయాడు.

ఇక కల్యాణ్ క్షణం ఆలస్యం చేయలేదు. బలవంత పెట్టి రామకృష్ణను ఖాళీ చేయించి వృద్ధాశ్రమం నుంచి తమ ఇంటికి తీసుకెళ్లాడు. రామకృష్ణ ఎంత వారించినా వినలేదు.

☆ ☆ ☆

ఏనాటి బంధం. ప్రాణ స్నేహితుడు కొడుకు కల్యాణ్. ఉప్పెనలో తల్లిదండ్రులు ఇద్దరూ కొట్టుకుపోతే కల్యాణ్‌ని చేరదీసి పెంచాడు రామకృష్ణ. వాసుకీ, కల్యాణికీ జరిగిన తగాదాలకి కారణం వాసులోని అసహనమేనని తెల్సినా చేసేదేమి లేక కల్యాణ్‌ని చిన్నప్పుడే హాస్టల్‌కి పంపేశాడు. ఆ రోజు సీత కూడా ఎంతో బాధ పడింది. కల్యాణ్ అలానే చదువుకుని చిన్న ఉద్యోగం కూడా సంపాదించుకుని ఒకింటి వాడవడం ఆనందకరం! అంతకంటే ఉన్నతమైన ఉద్యోగిగా ఎదిగినట్లు తెలుస్తుంటే మనసు బెలూన్‌లా ఎగురుతోంది.

కారు ఇంటి ముందు ఆగుతుంటే కల్యాణ్ భార్య, మూడేళ్ల కొడుకు సంతోషంగా బైటి కొచ్చారు, వారిని రామకృష్ణకు పరిచయం చేశాడు కల్యాణ్

తన పాదాలకు నమస్కరిస్తున్న నీరజను మనసారా ఆశీర్వదించాడు రామకృష్ణ. ''దీర్ఘ సుమంగళీ భవ'' అంటూ.

తల్లిని అనుసరిస్తున్న అభిషేక్‌ని ఎత్తుకొని ముద్దులాడాడు.

☆ ☆ ☆

అడుగడుగునా ఆ ఇంట్లో జరుగుతున్న మర్యాదలకి మనసు పులకరించి పోతోంది. భారమవుతోంది. భయం కలుగుతోంది.

''నీరజా! బాబు గారికేం కావాలో చూడు. నేను ఆఫీసుకు వెళ్లి వస్తాను.''

మర్నాటి నుంచీ రెండు రోజులు సెలవు పెట్టాడు కల్యాణ్. ఎవరెవరినో పిలిచి తనని ఆకాశమంత ఎత్తుల్లో పరిచయం చేస్తుంటే వారించాడు రామకృష్ణ.

''బాబూ కల్యాణ్! వృద్ధాప్యంలో నువ్వు నాకు ఇస్తున్న ఆప్యాయతాను రాగాల ముందు నేను చేసింది చాలా తక్కువ. నేను మీకు అతిథిని కాను. మీ ఇంట్లో వ్యక్తిని. ఎవరికైనా ఎక్కువ మర్యాదలు చేస్తే కొన్నాళ్లకు భారమవుతారు.

నా కోసం మీ దైనందిన వ్యవహారాలు మార్చుకోవద్దు. మీ ఇంట్లో వ్యక్తిగా చూస్తే చాలు. నాకీ బొమ్మ చాలు...'' అభిషేక్‌ని హృదయానికి హత్తుకున్నాడు రామకృష్ణ ప్రేమగా.

''మీ రాక వల్ల అనాథలమైన మేము ఎంత ఆనందంగా ఉన్నామో ... మీకు ఎలా చెప్పాలో అర్థం కావటం లేదు. అందుకే ఇలా...'' నసిగాడు కల్యాణ్.

''సంతోషం అనే దాన్ని షోగా చూపించ నక్కరలేదు. అది దాచినా దాగదు. వదనం మీద నాట్యం చేస్తుంది. ఆ ఆనందం నాకు మీ దంపతుల ముఖార విందాలై పురి విప్పి నాట్యం చేస్తూ కనిపిస్తోంది. అది చాలు బాబూ!'' తృప్తిగా అన్నాడు రామకృష్ణ.

కల్యాణ్ ఇంటికి రామకృష్ణ వచ్చి వారం అయింది. బజారు దాకా వెళ్లి వస్తానని చెప్పిన రామకృష్ణ ఇంటికి వచ్చేటప్పుడు ఏవో ప్యాకెట్లు పట్టుకొచ్చాడు. అందరినీ పిలిచి ఆప్యాయంగా ఇచ్చాడు.

కల్యాణ్‌కు సూట్... నీరజకు చీర.

''తాతా! మరి నాకో...'' అభిషేక్ ముద్దు మాటలకి కరిగిపోయి వాణ్ణి హృదయానికి హత్తుకుంటూ ''ఈ డ్రెస్ నీకు నాన్నా'' అంటూ అభిషేక్‌కు డ్రెస్ ఇచ్చాడు రామకృష్ణ. వాడి మొహం విప్పారింది.

''ఇవన్నీ ఎందుకు తెచ్చారు బాబు గారూ'' నొచ్చుకున్నాడు కల్యాణ్.

''నా సంతోషం కోసం కల్యాణ్. నేను ఇక్కడికి వచ్చినప్పుడు నా దగ్గర పెద్దగా డబ్బు లేదు. నేను వచ్చే ముందే నా పెన్షన్ ఇక్కడికి బదిలీ చేయించుకున్నాను. ఇప్పుడది ఈ నెలకు వచ్చింది. మీ నాన్న ఇస్తే కాదంటావా అమ్మా.''

ఆయన మాటలకు నీరజ చలించి పోయింది. దంపతులు ఇద్దరూ రామకృష్ణ పాదాలకు నమస్కరించారు.

''తాతా! నాకీ డ్రెస్ వేయ్...'' అభిషేక్ చేయి పట్టుకుని లాగుతుంటే రామకృష్ణ వాడిని ఎత్తుకుని డ్రెస్ వేయటానికి ప్రయత్నిస్తుంటే కల్యాణ్, నీరజల చిరునవ్వుల్లో... ఆనంద బాష్పాల్లో... తరతరాల మానవ ప్రేమ తళుక్కుమంది!

## అంతా టెక్నాలజీ మాయ

టాబు, జూహీచావ్లా, ఎన్టీఆర్, రంభ నటించిన సినిమా చూడాలనుందా? లేదూ ఎస్వీఆర్, సిల్క్ స్మిత కాంబినేషన్ కావాలా? - నో ప్రాబ్లం. కంప్యూటర్ టెక్నాలజీతో అంతా సాధ్యమే. చెన్నయ్‌కి చెందిన ఓ కంప్యూటర్ సంస్థ ఇప్పటికే తమిళంలో ఎంజిఆర్ చిత్రాన్నో దాన్ని నిర్మించే పనిలో ఉంది. దీని ఖర్చు రెండు నుంచీ మూడు మిలియన్ డాలర్లు. భలే భలే! ఎన్.టి.ఆర్. సినిమా మొదలవుతోందీ అని సంబర పడాలా? లేక కొత్త తారలకి ఛాన్స్ రాదేమో అని దిగులు పడాలా? అని వాపోతున్నారు సినీ జనాలు. అసలు కంప్యూటర్స్ రంగంలో పూర్తిగా దిగితే, ఇక కొత్తేమిటి, పాతేమిటి? అసలు తారలే ఉండరు ఎంచక్కా! జావా ప్రోగ్రామరా? మాక్రో మీడియా ప్రోగ్రా మరా?

